క్లుప్తంగా

వ్యవసాయ సాగు పద్ధతులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మాస్టర్ ట్రైనర్ బత్తి దేవి

రోలుగుంట: కొంతలంలో ప్రకృతి వ్యవసాయ శాఖ సౌజన్యంతో శనివారం వ్యవసాయ సాగు పద్ధతులపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు వినియోగించడం, వాటి తయారీపై ఈ సందర్భంగా ఆ శాఖ మాస్టర్ ట్రైనర్ బత్తి దేవి అవగాహన కల్పించారు. కషాయాలు తయారు, ఆకుకూరలు, కాయగూరలు సాగు, నవధాన్యాల సాగు, దిగుబడుల సాధనపై పూర్తిస్థాయిలో వివరించారు. సిబ్బంది సాయి, సుజాత, మోదినాయుడు, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు

మాడుగుల: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు. ఇప్పటికే ఆలయంలో అమ్మవారిని భక్తులు దర్శించుకోవడానికి వీలుగా ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

ఆలయాల్లో పరమ ఏకాదశి పూజలు



భజన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మాడుగుల రూరల్: అధిక ఆషాఢ మాసంలో వచ్చే పరమ ఏకాదశి పర్వదినం సందర్భంగా శనివారం ఆలయాల్లో భక్తులు పూజలు, అభిషేకాలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. కె.జె.పురం జంక్షన్‌లోని కల్యాణ వేంకటేశ్వర స్వామివారికి ఉదయం నుంచి పూజాది కార్యక్రమాలు చేశారు. కె.జె.పురం రామాలయంలో ఉదయం నుంచి అఖండ భజన కార్యక్రమం జరిగింది. వీరనారాయణం, మాడుగుల, గాదిరాయి, వీరవల్లి అగ్రహారం రామాలయాలు, మాడుగుల వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.

25 నుంచి సంతోషిమాత దీక్షలు



మాడుగుల రూరల్: శ్రావణ మాసం పురస్కరించుకుని కె.జె.పురం జంక్షన్‌లోని సంతోషి మాత ఆలయంలో ఈ నెల 25వ తేదీ నుంచి అమ్మవారి మాలాధారణ కార్యక్రమం ప్రారంభం కానుందని ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల అమ్మతల్లినాయుడు శనివారం తెలిపారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారి మాలాధారణ దీక్షలు ఉంటాయన్నారు. ఈ నెల 17వ తేదీ నుంచి శ్రావణమాసం ప్రారంభమవుతుందన్నారు. 18న తొలి శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, గోపూజలు నిర్వహిస్తామన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ



ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

నర్సీపట్నం: పర్యావరణాన్ని కాపాడుకుంటేనే జీవుల మనుగడ సాధ్యమనే విషయాన్ని అంతా గుర్తించాలని వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు అడిగర్ల వరహాలనాయుడు, ప్రసాద్ పేర్కొన్నారు. క్లబ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్లాస్టిక్ నిషేధంపై శనివారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ప్లాస్టిక్ వినియోగంతో మానవ మనుగడకు ప్రమాదం పొంచి ఉందన్నారు. ప్లాస్టిక్ నిషేధానికి మున్సిపల్ అధికారులు తీసుకుంటున్న చర్యలకు తమవంతు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

శివారు భూములకూ సాగునీరు

- కల్యాణపులోవ ప్రధాన కాలువ లీకేజీలకు పరిష్కారం
- గండ్లు పడిన అక్విడెక్ట్‌లకు రూ.10 లక్షలతో మరమ్మతులు
- నీరు విడుదల రేపు



ములకలాపల్లి వద్ద గతంలో అక్విడెక్ట్‌కు పడిన గండి(ఫైల్)



గండికి శాశ్వత పనులు పూర్తి చేస్తున్న దృశ్యం

రావికమతం: ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ చొరవతో పదేళ్లుగా కల్యాణపులోవ రిజర్వాయర్‌ను పట్టి పీడిస్తున్న ప్రధాన సమస్యకు పరిష్కారం లభించింది. రిజర్వాయర్ నీరు వడివడిగా శివారు భూములకు చేరే అవకాశం కలిగింది. ప్రధాన కాలువలో చీమలపాడు, ములకలాపల్లి అక్విడెక్ట్‌లు వద్ద చాలా నీరు వృథాగా పోయేది. ఆ వృథాను అరికట్టాలని ఏళ్ల తరబడి రైతులు మొరపెట్టుకుంటున్నా గత పాలకులు పట్టించుకున్న పాపానపోలేదు. పర్యవసానంగా గతేడాది నీటి ప్రవాహానికి ఏకంగా గండి కొట్టేసింది. మరో అక్విడెక్ట్ వద్ద పెద్ద రంధ్రాలు పడి నీరు మరింతగా గెడ్డలోకి కలిసిపోయేది. ఈ కారణంగా గతేడాది కొన్ని ఎకరాలకు సాగునీరందక రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ వద్ద జెడ్.కొత్తపట్నం,



చీమలపాడు అక్విడెక్ట్ వద్ద రంధ్రాలు పడి వృథాగా పోతున్న నీరు(ఫైల్)

గంపవానిపాలెం, కొత్తకోట, దొండపూడి తదితర గ్రామాల్లో రైతులు పై సమస్యనే ఏకరువు పెట్టారు. దాంతో సమస్య పరిష్కారానికి ధర్మశ్రీ నడుం కట్టారు. ఇరిగేషన్ అధికారులతో రిజర్వాయర్ కాలువను దెబ్బతిన్న అక్విడెక్ట్‌లను పరిశీలించారు. అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి దృష్టికి తీసుకెళ్లారు. అక్విడెక్ట్ మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయించి ఆపై రూ.10 లక్షలు మంజూరు చేశారు. వాటితో రెండు అక్విడెక్ట్‌ల మరమ్మతులు పూర్తిస్థాయిలో చేపట్టారు. శనివారం నాటికి పనులు పూర్తయ్యాయని, ఆదివారం ట్రయల్ రన్ చేసి సోమవారం నుంచి పూర్తి స్థాయిలో సాగునీరందిస్తామని ఇరిగేషన్ ఏఈ సత్యనారాయణ దొర తెలిపారు.

ఇప్పటికే రూ.28 లక్షలతో కాలువల్లో పూడికతీత

రిజర్వాయర్ ప్రధాన కాలువతోపాటు పిల్ల కాలువలన్నీ పదేళ్లుగా పూర్తిగా మట్టి, తుప్పలతో పూడిపోయాయి. రిజర్వాయర్ నీరు విడుదల చేసినా సక్రమంగా సాగు భూములకు చేరేది కాదు. దీంతో మరిన్ని క్యూసెక్కులు నీరు విడుదల చేస్తే కాలువపై నుంచి పొంగిపొర్లి కాలువ గట్లు దెబ్బతినేవి. ఈ సమస్య పరిష్కారానికి విప్ ధర్మశ్రీ సంకల్పించి ఇరిగేషన్, ఉపాధి అధికారులతో సమీక్షించి 11 గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ఆ కాలువ పూడిక తీతకు కేటాయించారు. రూ.28 లక్షలతో ప్రధాన కాలువతోపాటు అన్ని పిల్ల కాలువల్లో పూడిక తీతతో కళకళలాడుతున్నాయి. నీరు విడుదల చేయగానే శివారు భూములకు 24 గంటల్లో చేరుతుంది.



పూర్తి స్థాయి నివారణ పనులు చేపట్టిన దృశ్యం

మంచి రోజులు వచ్చాయి



కల్యాణపులోవ రిజర్వాయర్‌కు ఇన్నాళ్లకు మంచి రోజులు వచ్చాయి. పదేళ్లుగా పూడికపోయిన కాలువలన్నీ కళకళలాడుతున్నాయి. రూ.28 లక్షలతో అభివృద్ధి చేయడం ఆనందంగా ఉంది. రెండు ప్రధాన అక్విడెక్ట్‌లకూ ప్రభుత్వ విప్ ధర్మశ్రీ మరో రూ.10 లక్షలతో పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించి రైతుల ఇబ్బందులను తొలగించారు.

– గాలి రమణబాబు, రైతు, జెడ్.కొత్తపట్నం, రావికమతం మండలం

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు

జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు త్రిమూర్తులు



మాట్లాడుతున్న జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు త్రిమూర్తులు

నాతవరం: సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు విజ్ఞానం పెంపొందించేందుకు గ్రంథాలయాలు ఎంతో దోహదపడతాయని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు త్రిమూర్తులు అన్నారు. నర్సీపట్నం డివిజన్ గ్రంథాలయాధికారుల ఆధ్వర్యంలో శనివారం స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డాక్టరు ఎస్.ఆర్. రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ బ్రిటీష్ హయాంలో స్వాతంత్ర్య పోరాటం చేస్తే, రెండోది గ్రంథాలయాల ఏర్పాటుకు దేశ వ్యాప్తంగా ఉద్యమాలు చేశారన్నారు. ఆ సమయంలో రంగనాథన్‌తోపాటు ఎ. వెంకటరమణ వంటి మహనీయులు చేసిన త్యాగాలు నేటి తరానికి చాటి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. సమాచార వ్యవస్థ ఆధునిక పరిజ్ఞానం లేక ముందు గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలు తర్వాత ప్రధాన భూమిక గ్రంథాలయాలే పోషించేవని గుర్తుచేశారు. ఎంతో మంది పేద విద్యార్థులు గ్రంథాలయాల్లో లభించే పుస్తకాలు, పత్రికలు చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకున్నారన్నారు. డివిజన్ స్థాయిలో లైబ్రేరియన్స్ డే వేడుకలు నిర్వహించేందుకు ముందుకొచ్చిన నాతవరం గ్రంథపాలకుడు కన్నబాబును అభినందించారు. నేటి తరం వారికి కాలానుగుణంగా వస్తున్న మార్పులకు గ్రంథాలయాలల్లో అందించే సేవలపై ఆయన వివరించారు. కార్యక్రమంలో పలు మండలాలకు చెందిన గ్రంథపాలకులు మురళీకృష్ణ, పి.దమయంతి, ఎస్.రాజుబాబు, ఆర్.అప్పలనాయుడు, ఆర్.వి.సత్యనారాయణ, నాతవరం హైస్కూల్ ఉపాధ్యాయులు ప్రభుదాస్, నాగేశ్వరరావు, ఎం.నానిబాబు, కోటయ్య పాల్గొన్నారు.

నీమాస్త్రంతో తెగుళ్ల నివారణ



రైతులకు నీమాస్త్రంపై అవగాహన కల్పిస్తున్న గుణావతి

రావికమతం: వరి పంటలో అధిక నష్టాన్ని కలిగించే రసం పీల్చే పురుగు, వాటి గుడ్లను, చిన్న చిన్న గొంగళి పురుగులను నీమాస్త్రం నాశనం చేస్తుందని ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్పీ గుణావతి తెలిపారు. ఆమె శనివారం దొండపూడిలో రైతులకు అవగాహన కల్పించారు. ఒక డ్రమ్ములో 200 లీటర్ల నీటిని తీసుకుని దానిలో 10 లీటర్ల గోమూత్రం, రెండు కేజీల ఆవుపేడ, ముద్దగా చేసిన 10 కేజీల వేపాకు కలిపి ఉదయం సాయంత్రం సవ్యదిశలో కలిపితే 48 గంటల్లో నీమాస్త్రం తయారవుతుందన్నారు. ఈ కషాయం రసం పీల్చే పురుగు గుడ్లను, చిన్న చిన్న గొంగళి పురుగులను నాశనం చేస్తుందని వివరించారు. ఇవి రైతుకు ఎటువంటి రసాయనం లేని మందులుగా ఉపయోగపడతాయని, ఆరోగ్యంతోపాటు పంటకు మేలు చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఏపీ సీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా నగర సంకీర్తన వార్షికోత్సవం



నగర సంకీర్తనగా చేపడుతున్న భక్తులు



ఆలయ ఆవరణలో చిన్నారుల కోలాటం

మాకవరపాలెం: నగర సంకీర్తన వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తామరంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి నెలా రెండో శనివారం నగర సంకీర్తన నిర్వహిస్తారు. ఈ కార్యక్రమం ప్రారంభించి 11 ఏళ్లు పూర్తి కావడంతో శనివారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారు జామునే స్థానిక బస్టాండు నుంచి తామరం ఆలయం వరకు భక్తిగీతాలు ఆలపించుకుంటూ పెద్ద ఎత్తున భక్తులు బయలుదేరి వెళ్లారు. అనంతరం ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆ సమయంలో మహిళలు, చిన్నారులతో నిర్వహించిన కోలాటాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాదాలు పంచిపెట్టారు. భారీ ఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మార్మోగింది.

'గడప గడప'కు ముగింపు సభకు తరలిరండి



జెండాలు తయారు చేయిస్తున్న ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు

రోలుగుంట: చోడవరం డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం ముగింపు విజయోత్సవ సభకు తరలి రావాలని ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు కోరారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఎంపీపీలకు అవసరమైన అన్ని ఏర్పాట్ల బాధ్యతలను ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అప్పగించారు. అందులో భాగంగా రోలుగుంటలో పార్టీ జెండాలను సిద్ధం చేస్తున్నారు. ఈ సభలో పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, జిల్లా మంత్రులు బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్‌నాథ్ పాల్గొనున్నారని ఎంపీపీ తెలిపారు. మండలం నుంచి అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, అభిమానులు తరలి రావాలని కోరారు.

కొత్త ఎల్లవరంలో చురుగ్గా రీసర్వే

గొలుగొండ: కొత్త ఎల్లవరంలో సమగ్ర రీసర్వే చురుగ్గా సాగుతోంది. ఈనాందార్లు, సాగుదార్లుకు త్వరలో సమస్య పరిష్కారమయ్యే అవకాశముంది. కొత్త ఎల్లవరం గ్రామ రెవెన్యూ పరిధిలో 239 మంది రైతులకుగాను 1,580 ఎకరాల ఈనాం భూమి ఉంది. ప్రస్తుతం ఈ భూమి సెటిల్ చేయడం కోసం మండల సర్వే బృంద సభ్యులు సమగ్ర రీసర్వే కార్యక్రమం చేస్తున్నారు. మరో మూడు రోజుల్లో ఈ సర్వే పూర్తయ్యే అవకాశముంది. ఈ భూమి సెటిల్‌మెంట్ పూర్తయితే రెండు వర్గాల వారికి ప్రయోజనం కలిగే అవకాశముంది. దీనిపై ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కలెక్టరును, నర్సీపట్నం ఆర్డీవో జయరాంను కలిసి మాట్లాడారు.

నేడూ ఓటరు సర్వే చేయాలి

నర్సీపట్నం ఆర్డీవో జయరాం



సర్వేపై సిబ్బందికి సందేహాలు నివృత్తి చేస్తున్న ఆర్డీవో జయరాం, తహసీల్దార్ శ్రీనివాస్ నాయుడు



శృంగవరంలో ఇంటింటా ఓటరు సర్వేను పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ రమేష్‌బాబు

నాతవరం: ఎన్నికలు కమిషనర్ ఆదేశాల ప్రకారం బీఎల్వోలంతా ఆదివారమూ ఇంటింటా ఓటరు సర్వే చేయాలని నర్సీపట్నం ఆర్డీవో హెచ్‌వీ జయరాం ఆదేశించారు. మండలంలోని ఎం.పట్నం పంచాయతీ శివారు ఎ.శరభవరం, శృంగవరం, గాంధీనగరం గ్రామాల్లో శనివారం ఆయన వీధుల్లో పర్యటించి ఓటరు సర్వేను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. సర్వే గడువు సమీపిస్తున్నందున సెలవు రోజుల్లోనూ ఇంటింటా సర్వే చేసి అప్‌లోడు చేయాలన్నారు. పోలింగ్ బూత్ అధికారులు, సూపర్‌వైజర్లు ఆదివారం ఉదయం నుంచి విధుల్లో ఉండాలన్నారు. తాను లేదా కలెక్టరు ఆకస్మిక తనిఖీలు చేస్తామని సూచించారు. ఈ నెల 21వ తేదీతో సర్వే ముగిస్తున్నందున నిర్లక్ష్యంగా పని చేసే పోలింగ్ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో 262 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ప్రతి పోలింగ్ కేంద్రంలో బీఎల్వోలు పని చేస్తున్నారన్నారు. తహసీల్దార్లు, సూపర్‌వైజర్లు అంకితభావంతో పని చేస్తే ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పొప్పులు ఉండబోవన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.ఎస్.వి. శ్రీనివాస్‌నాయుడు, డిప్యూటీ తహసీల్దారు చైన్లు, సూపర్‌వైజర్లు డి.కృష్ణ, ^నాయుడు, శ్రీనివాస్, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల సర్వేను పరిశీలించిన ఆర్డీవో

మాకవరపాలెం: ఇంటింటికీ ఓటర్ల సర్వేను నర్సీపట్నం ఆర్డీవో జయరాం శనివారం పరిశీలించారు. బూరుగుపాలెం, చామంతిపురంలో బీఎల్‌వోలు నిర్వహిస్తున్న ఓటర్ల సర్వేను తహసీల్దార్ ప్రసాద్‌తో కలిసి ఆయన పరిశీలించారు. మరణించిన, శాశ్వతంగా గ్రామం విడిచిపెట్టి వెళ్లిన వారి ఓట్లను తగిన ఆధారాలతో తొలగించాలన్నారు. సర్వే పక్కాగా చేయాలని ఆదేశించారు.

ఓటరు సర్వేను పర్యవేక్షించిన తహసీల్దార్ రమేష్‌బాబు

కె.కోటపాడు: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇంటింటా ఓటరు సర్వే కార్యక్రమాన్ని ఈ నెల 21 కల్లా పూర్తి చేయాలని తహసీల్దార్ జె.రమేష్‌బాబు తెలిపారు. శృంగవరం, సూదివలస, గుల్లేపల్లి గ్రామాల్లో శనివారం బీఎల్వోలు నిర్వహిస్తున్న ఓటరు సర్వే కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వచ్చే జనవరి ఒకటో తేదీకి 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు కల్పించాలన్నారు. కుటుంబంలో పది ఓట్లు కంటే ఎక్కువ ఓటర్లు ఉంటే, వారికి రెండో డోర్ నెంబర్ కేటాయించాలని సూచించారు. ఆయన వెంట ఓటరు సర్వే సూపర్‌వైజర్ రామచంద్రమూర్తి, బీఎల్వోలు గోవింద్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిగ్రస్తురాలికి పీఎం సహాయ నిధి



బాధితురాలికి చెక్కు అందజేస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్: మండలంలో కొత్తూరు పంచాయతీ రామాపురం గ్రామానికి చెందిన క్యాన్సర్ వ్యాధిగ్రస్తురాలు ఏడువాక సత్యవతికి పీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.3 లక్షల చెక్కును ఎంపీ బి.వి.సత్యవతి తన కార్యాలయంలో శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు. ఈ చెక్కును అగనంపూడి హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రిలో అందించి చికిత్స చేయించుకోవాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో రుద్ర హోమం

మాకవరపాలెం: వామలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్రహోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని శనివారం ఉదయం నుంచి ఆలయంలో రుద్ర హోమం, లక్ష్మీగణపతి హోమం, మృత్యుంజయ హోమంతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించారు.

17న మండల సర్వసభ్య సమావేశం

దేవరాపల్లి: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 17 నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి తెలిపారు. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభిస్తామన్నారు. ఈ సమావేశానికి జెడ్పీటీసీ సహా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరవుతారన్నారు. అన్ని శాఖల అధికారులు తమ శాఖల వారీగా తగు సమాచారంతో హాజరు కావాలని సూచించారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు

మాడుగుల రూరల్: మిషన్ ఇంద్ర ధనుస్సులో భాగంగా చిన్నారులకు, బాలింతలు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. శనివారం కె.జె.పురం, కింతలి పీహెచ్‌సీ పరిధిలోని 19 గ్రామ సచివాలయాలు, వడ్డాది పీహెచ్‌సీ పరిధిలోని నాలుగు గ్రామ సచివాలయాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

చలో విజయవాడను విజయవంతం చేయండి

నర్సీపట్నం: సీపీఎస్ రద్దు చేయాలని కోరుతూ వచ్చేనెల ఒకటిన చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీసీపీఎస్ఈఏ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సూర్యప్రకాష్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా స్థాయి కార్యవర్గ సమావేశంలో చలో విజయవాడ వైనాట్ ఓపీఎస్ అనేక కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అధ్యక్షుడు కె.సతీష్, జి.శ్రీను, ఉమామహేశ్వరరావు, లోవ, అప్పలనాయుడు, సింహాద్రి, స్వామి, లోవరాజు, కిరణ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భక్తి పాటల కచేరీ

అనకాపల్లిటౌన్: స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం వివేకానంద కళా పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించి భక్తి పాటల కచేరీ ఆకట్టుకుంది. అధిక శ్రావణమాసంలో ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించి ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ కె.విష్ణుమూర్తి పలు భక్తి గీతాలు ఆలపించారు. కళా పరిషత్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సకాలంలో గ్రామీణ రోగులకు వైద్య సేవలు

- డీఎంహెచ్‌వో హేమంత్



విలేజ్ హెల్త్ క్లినిక్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో హేమంత్

అనకాపల్లి టౌన్: వివిధ రోగాలతో ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో ఎ.హేమంత్ ఆదేశించారు. మండలంలో శంకరంలో విలేజ్ హెల్త్ క్లినిక్(ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్) శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులను వారి స్వగృహాలకు వెళ్లి వైద్య సేవలందించాలని సూచించారు. వారికి సకాలంలో వైద్య సేవలు అందించినట్లయితే వ్యాధిని మొదటి దశలో నిర్మూలించవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు. గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తుమ్మపాల సీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్ఎస్ షమీమ్, ఎంఎల్‌హెచ్‌పీ ఆర్.సత్యవతి, ఏఎన్ఎం ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

జోరుగా వరినాట్లు

- సాగునీటి వసతి పొలాల్లో పనులు
- మెట్ట ప్రాంతాల్లో ముందుకు సాగని వైనం



మేడిచర్లలో వరి నాట్ల పనుల్లో మహిళలు



రామచంద్రపురంలో వరినారు పనుల్లో మహిళా కూలీలు




మాడుగుల రాచెరువు ఆయకట్టులో ఎండుతున్న వరినారు

కె.కోటపాడు: సాగునీటి వనరులున్న గ్రామాల్లో ముమ్మరంగా వరినాట్లు వేస్తున్నారు. ఇటీవల అడపా దడపా కురిసిన వర్షాలతోపాటు రైవాడ ఆయకట్టు పరిధిలో ఎ.కోడూరు, వారాడ, మేడిచర్ల, ఎ.భీమవరం, రొంగలినాయుడుపాలెం తదితర గ్రామాల్లో ప్రస్తుతం వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. ఆయా గ్రామాల్లో ఇప్పటికే దమ్ములు పూర్తి చేసిన పొలాల్లో వరినాట్లు వేస్తున్నారు. మండల వ్యాప్తంగా ఖరీఫ్‌లో 2,300 హెక్టార్లలో వరిపంటను రైతులు సాగు చేస్తుంటారు. ప్రస్తుతం 800 హెక్టార్లలో వరినాట్లు పూర్తయినట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో వర్షాలు సమృద్ధిగా కురిస్తే మిగిలిన గ్రామాల్లోనూ వరినాట్ల పనులు పూర్తవుతాయని తెలిపారు.

ఎండుతున్న వరినాట్లు

మాడుగుల రూరల్: వారం రోజులుగా వేసవికి దీటుగా కాస్తున్న మండుటెండలకు గ్రామాల్లో ఇటీవల వేసిన వరినాట్లు, వరినారు ఎండిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత నెలలో కురిసిన వర్షాలకు వేసిన వరినాట్లు మెట్ట భూముల్లో ఎండిపోతున్నాయి. జలాశయం దిగువ ఆయకట్టు భూముల్లో వరినాట్లు ప్రస్తుతం ముమ్మరంగా సాగుతున్నాయి. మాడుగుల, కె.జె.పురం, పప్పుశెట్టి చెరువు, ఎరుకువాడ, ముకుందపురం, తదితర గ్రామాల్లో ఇటీవల వేసిన వరినాట్లు, మెట్ట భూముల్లో వరినారు ఎండిముఖం పట్టడంతో వరుణుడు కరుణ కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.

67 మందికి వైద్య పరీక్షలు



ఎ.భీమవరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి సుబ్రహ్మణ్యం

కె.కోటపాడు: వైద్య సిబ్బంది ఇచ్చే ఆరోగ్య జాగ్రత్తలను ప్రజలు పాటించాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. ఎ.భీమవరంలో శనివారం ఫ్యామిలీ డాక్టరు సేవలందించారు. 67 మంది రోగులను ఆయన పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వర్షాకాలం నేపథ్యంలో ఇంటి పరిసరాల్లో మురుగు నిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ తర్రా సన్యాసమ్మ, శేషు, హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.